క్లుప్తంగా

ఏటూరునాగారం తహసీల్దార్‌గా లక్ష్మణ్



ఏటూరునాగారం: మండల తహసీల్దార్‌గా గూడూరు లక్ష్మణ్ సోమవారం విధుల్లో చేరారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సంజీవ జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. వాజేడులో పనిచేసే లక్ష్మణ్ ఏటూరునాగారం బదిలీ అయ్యారు. లక్ష్మణ్ విధుల్లో చేరడంతో డీటీ రాహుల్, ఆర్‌ఐ శ్రీనివాస్, సిబ్బంది సన్మానించారు.

బాధ్యతల స్వీకరణ



వాజేడు : స్థానిక తహసీల్దార్‌గా సయ్యద్ సర్వర్ సోమవారం విధుల్లో చేరారు. వాజేడు డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న సయ్యద్ సర్వర్‌కు అదనపు బాధ్యతలను అప్పగించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన గూడూరు లక్ష్మణ్ ఏటూర్‌నాగారం మండలానికి బదిలీ అయ్యారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన సదస్సు

ఏటూరునాగారం: విద్యుత్ ప్రమాదాల నివారణకు బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో విద్యుత్ వినియోగదారులు, రైతులు, యువకులు, మహిళలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఏఈ అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సకాలంలో హాజరై సూచనలు, సలహాలను పాటించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ములుగు రూరల్ : విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ సాయిక్రిష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బండారుపల్లి ఫీడర్ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. బండారుపల్లి, జీవింతరావుపల్లి, గణేష్‌లాల్‌పల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

చెక్కుల పంపిణీ

ములుగు రూరల్(గోవిందరావుపేట): గోవిందరావుపేట మండలంలోని మందాడి వీరారెడ్డి, తుమ్మ రేష్మ శ్రీ కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం పొంది ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తులు చేసుకున్న బాధితులకు ఎమ్మెల్యే సీతక్క ఆదేశాల మేరకు కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సీతారాంనాయక్ ఆధ్వర్యంలో సోమవారం చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిసాన్‌సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, జిల్లా నాయకులు కణతల నాగేందర్‌రావు, పాలడుగు వెంకట క్రిష్ణ, సోమయ్య, శ్రీకాంత్, ఏడుకొండలు, వెంకటేశ్వర్లు, నాగమణి, చంద్రశేఖర్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



వాజేడు : మండల కేంద్రంలో ఐటీఐ కళాశాల కాంట్రాక్ట్ సిబ్బంది సోమవారం సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. నూతన సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించిన విషయం తెలిసిందే. దీంతో కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు.

చెట్టును ఢీకొన్న కారు

మహదేవపూర్: కాళేశ్వరం దేవాలయానికి దర్శనం కోసం వెళ్లి వస్తున్న భూపాలపల్లి గ్రామస్తులు కాళేశ్వరం అడవిలో కోతుల గుంపు అడ్డు రావడంతో కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి. వెంటనే 108 ద్వారా మాదాపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం తరలించి ప్రథమ చికిత్స అనంతరం భూపాలపల్లి ఆస్పత్రికి తరలించినట్లు డాక్టర్లు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో పాడిగేదె మృతి

చిట్యాల : మండలంలోని చింతకుంట రామయ్యపల్లిలో మడికొండ శ్రీనివాస్‌కు చెందిన పాడి గేదె విద్యుత్ షాక్‌తో సోమవారం ఉదయం మృతి చెందింది. శ్రీనివాస్ రోజు మాదరిగా పాడిగేదెను మేతకోసం పంపిస్తున్న నేపథ్యంలో గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎర్త్ వైర్ తాకి షాక్ రావడంతో అటుగా వెళ్తున్న పాడిగేదె మృత్యువాత పడింది.

ములుగు రూరల్ : సర్వర్ స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్



వెంకటాపురం (కె) : జెండావిష్కరించిన నాయకులు



వెంకటాపురం (ఎం)లో...



కార్మికుల త్యాగఫలం మే డే

ఎందరో కార్మికుల త్యాగఫలమే ఈనాటి మే డే అని పలువురు వక్తలు అన్నారు. ప్రపంచ కార్మికుల దినోత్సవం మే డే సందర్భంగా సోమవారం కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ములుగు, వెంకటాపురం(కె), ఎస్ఎస్ తాడ్వాయి, వాజేడు, వెంకటాపురం (ఎం), మండల కేంద్రాలు, వివిధ గ్రామాల్లో మే డే సందర్భంగా పలువురు జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో వివిధ కార్మిక సంఘాల నాయకులు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఏటూరునాగారం : సీపీఎం కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు



వాజేడు: జెండా ఎగుర వేసి అభివాదం చేస్తున్న బీఆర్ఎస్, బీఆర్‌టీయూ, బీఆర్ఎస్‌కె నాయకులు



ఎస్ఎస్ తాడ్వాయి : ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



మంగపేట : కమలాపురంలో జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న జేఏసీ నాయకులు



ములుగు రూరల్ : గోవిందరావుపేటలో మాట్లాడుతున్న సూడి కృష్ణారెడ్డి



ములుగులో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యం



బోరునర్సాపురం వద్ద ధాన్యంపై కప్పి ఉంచిన టార్పాలిన్లలో నిలిచి ఉన్న వర్షపునీరు

మంగపేట: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి కల్లాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టి విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన ధాన్యంతో పాటు కొద్ది రోజుల క్రితం కోసి ఆరబెట్టిన వేల క్వింటాళ్ల ధాన్యం తడిసి ముద్దయింది. 20 రోజుల క్రితం కోసి ఆరబెట్టి ఉంచిన ధాన్యం ఇటీవల కురిసిన వర్షాలకు మొలకెత్తింది. చేతికి అందవచ్చిన పంట కళ్లెదుట తడిపోయి మొలకెత్తు తుండటంతో చేసేది ఏమీలేక రైతులు కన్నీరు పెడుతున్నారు. ఆరబెట్టిన ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పినా భారీ గాలులకు లేచిపోయి ధాన్యం తడిసిపోవడంతో పగలు ఆరబెట్టడం సాయంత్రం దగ్గరకి చేర్చడం తీరని భారంగా ఉందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి తడిన ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



గంపోనిగూడెం వద్ద కల్లంలో తడిసి ముద్దయిన ధాన్యం

తడిసిన ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనాలి

- మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించిన సీతక్క



బోరునర్సాపురంలో మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సీతక్క

మంగపేట: అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని ములుగు ఎమ్మెల్యే సీతక్క డిమాండ్ చేశారు. మండలంలోని బోరునర్సాపురంలో అకాల వర్షాల కారణంగా తడిసి మొలకెత్తిన ధాన్యం రాశులను సీతక్క సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ కొద్ది రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టి ఉంచిన ధాన్య తడిసి మొలకెత్తడంతో రైతులు తీవ్రంగా నష్ట పోయారన్నారు. రైతులకు ఎలాంటి నష్టం జరుగకుండా తడిసిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసేంత వరకు రైతులకు అండగా ఉంటామని వారి పక్షాన పోరాడుతామని రైతులు అధైర్య పడొద్దన్నారు. గతంలో తరుగు పేరిట క్వింటాకు 10 కిలోలు కటింగ్ చేసి మోసం చేసి అన్యాయం చేశారన్నారు. కేంద్రాల్లో ధాన్యం ఆరబెట్టి నెల రోజులు అవుతున్నా పేరుకు కేంద్రాలు ప్రారంభించిన అధికారులు కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే సీతక్క
- బీఆర్ఎస్, బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో భారీ చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన వారిని పార్టీ కండువాతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే సీతక్క

మంగపేట : కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం అవుతుందని కాంగ్రెస్ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. మండలంలోని కమలాపురంలో కాంగ్రెస్ అనుబంధ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు, మండల ఇన్‌చార్జ్ గుమ్మడి సోమయ్య అధ్యక్షతన సోమవారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎస్సీ కాలనీ, ఇందిరానగర్‌కు చెందిన సుమారు 100 కుటుంబాల్లోని బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన మహిళలు, యువకులు మేడిపల్లి శశికుమార్, గోలి విజయశేఖర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిని సీతక్క పార్టీ కండువాతో సత్కరించి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ గడిచిన తొమ్మిదేళ్ల బీఆర్ఎస్, బీజేపీ పాలనలో పేదప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. జీఎస్టీ పేరుతో పేదలపై పన్నులు మోపి పెద్దలకు పెడుతున్న బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలకు జరుగనున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సోనియాగాంధి అమలులోకి తెచ్చిన ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎత్తివేయాలని చూస్తున్నాయన్నారు.

బిల్టు సమస్యపై నిప్పులు చెరిగిన సీతక్క

కేవలం కార్మికుల ఓట్ల కోసం బిల్టు సమస్యను పరిష్కరిస్తామని హామీలు ఇచ్చి కేవలం రాయితీలు ప్రకటించి సమస్యను పరిష్కరించకుండా కార్మికుల కుటుంబాలను రోడ్డు పాలు చేసిన బీఆర్ఎస్, బీజేపీల తీరుపై సీతక్క నిప్పులు చెరిగారు. 10 ఏళ్ల నుంచి మూతపడిన బిల్టు ప్యాక్టరీని తెరిపించాల్సిన బాధ్యత బీఆర్ఎస్, బీజేపీ పార్టీలపై ఉన్నా ఎందకు స్పందించలేదని ప్రశ్నించారు. అధికార పార్టీ మాయమాటలను నమ్మిన కార్మికులు మోసపోయి నేడు వేతనాలు రాక అర్ధాకలితో దుర్భర జీవనం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కొమరం ధనలక్ష్మి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులుగా పూజారి సురేందర్, బీసీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది నర్సింహారావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షురాలు సృజన, కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు శానం నిర్మల, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చాద మల్లయ్య, బీసీసెల్ అధ్యక్షుడు ఆదినారాయణ, ఆకు పవన్, భగవాన్‌రెడ్డి, యానయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధితుల కుటుంబానికి పరామర్శ



బాధితులకు చెక్కులను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని నర్సాపూర్‌కు చెందిన మహబూబాబాద్ డీడీ మంకిడి ఎర్రయ్య కుమారుడు ప్రదీప్‌కిరణ్ ఇటీవల మృతి చెందాడు. సోమవారం కాంగ్రెస్ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క ఆయన కుటుంబాన్ని పరామర్శించింది. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ మంకిడి నరసింహాస్వామి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ లాలయ్య, పార్టీ యూత్ మండల అధ్యక్షుడు కోడి సతీష్, నాయకులు పల్నాటి సత్యం, నాగార్జున్ ఉన్నారు.

మంగపేట : మండలంలోని కమలాపురంలో ఇటీవల మృతి చెందిన పాలసాని అశోక్‌రెడ్డి, పల్లి రమణ, పార్టీ సీనియర్ నాయకుడు అమర్‌నాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సీతక్క పరామర్శించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదంలో గాయపడిన గంగుల శివకుమార్‌ను పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్టీసెల్ అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, బ్లాక్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా నాయకులు పూజారి సురేందర్, పెద్ది నర్సింహా రావు, మండల నాయకులు, చాద మల్లయ్య, ఆది నారాయణ, యానయ్య, సాంబశివ రెడ్డి, నాగిరెడ్డి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాగజ్యోతి

ఎస్ఎస్‌తాడ్వాయి: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. సీఎం కేసీఆర్ పోడు భూముల పట్టాలు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఫైల్‌పై సంతకం చేసిన సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కేసీఆర్ చిత్ర పటానికి పార్టీ నాయకులతో కలిసి నాగజ్యోతి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దండగుల మల్లయ్య, సర్పంచ్‌లు గడ్డం అరుణ, నాగేశ్వరరావు పుల్లూరి గౌరమ్మ, ఉపసర్పంచ్ ఇంద్రసేనారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు బందారి చంద్రయ్య, మహిళ మండల అధ్యక్షురాలు నాగమ్మ, నాయకులు విక్రమ్, జైపాల్‌రెడ్డి, సతీష్, పూర్ణచందు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీపీఎస్‌ల సమ్మె



ఏటూరునాగారం : కళ్లకు నల్లరిబ్బన్స్ కట్టుకొని నిరసన వ్యక్తంచేస్తున్న కార్యదర్శులు



వెంకటాపురం(ఎం) : కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న కార్యదర్శులు



వాజేడు: జూనియర్ కార్య దర్శులకు సంఘీభావంగా కూర్చున్న కాంగ్రెస్ నాయకులు

వెంకటాపురం(ఎం): స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయితీ కార్యదర్శులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. జీపీ కా రోబార్లు, ఆపరేటర్లు సంఘీభావం తెలుపుతూ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏటూరునాగారం : జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శాంతియుతంగా చేపట్టిన సమ్మె సోమవారం నాటికి నాలుగో రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా కార్యదర్శులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాగరాజు, సతీష్, సందీప్, లక్ష్మీనారాయణ, అశోక్, హసీనా, రాజ్యలక్ష్మి,మంజుల, శ్రీనివాస్, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

వాజేడు: గత నాలుగు రోజులుగా గ్రామ పంచాయతీ జూనియర్ కార్యదర్శులు చేస్తున్న సమ్మెకు కాంగ్రెస్, సీపీఎం పార్టీలు సోమవారం సంఘీభావం తెలిపాయి. పలువురు సర్పంచ్‌లు, సీనియర్ పంచాయతీ కార్యదర్శులు సంఘీభావం తెలిపారు.

'మిషన్ భగీరథ'తో ఇంటింటికీ తాగునీరు



జెండాను ఎగురవేసిన రామకృష్ణ

ఏటూరునాగారం: సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటి ఆడబిడ్డ బయటకు వెళ్లకుండా ప్రతి ఇంటికి తాగునీరు అందుతుందని జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ సలీం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట మిషన్ భగీరథ కార్మికుల యూనియన్ జెండాను మిషన్ భగీరథ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు కాళ్ల రామకృష్ణ ఎగురవేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి కార్మికుడిని ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తించాలని, 8 గంటల పని కల్పించాలన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటపట రఘు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ మనకు కల్పించిన హక్కుల కోసం ప్రతి కార్మికుడు పోరాటం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా మైనార్టీసెల్ ఇన్‌చార్జ్ ఖాజాపాషా, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, తాడ్వాయి మండలాలకు చెందిన లైన్‌మెన్‌లు, ఫిట్టర్, పంపు ఆపరేటర్లు, హెల్పర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఏటూరునాగారం: మండలంలోని రామన్నగూడెంకు చెందిన కాంగ్రెస్ నాయకుడు గార రమేష్ తండ్రి బక్కయ్య అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ములుగు ఎమ్మెల్యే సీతక్క ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు రూ. 10వేలు ఆర్థిక సాయం అందజేశారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాలరాజు, నాయకులు పాల్గొన్నారు.

జేఏసీపై బురద చల్లడం పద్ధతి కాదు



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు రాంచందర్

మంగపేట: కార్మికుల సమస్యపై చిత్తశుద్ధితో పనిచేస్తున్న జేఏసీపై ఆర్‌పీతో కుమ్మక్కయ్యారని బురదచల్లే ఆరోపణలు చేయడం పద్ధతి కాదని జేఏసీ నాయకులు హెచ్చరించారు. కమలాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఎన్‌సీఎల్‌టీ కోర్టు తీర్పు కార్మికులకు వ్యతిరేకంగా రావడంతో నిరాశకు గురైన కార్మికులకు చట్టపరంగా రావలసిన గ్రాడ్యుటి, పీఎఫ్ బకాయిలను ఇంప్లిమెంటేషన్, మానిటరింగ్ కమిటీ (ఐఎంసీ)కి పంపించినామన్నారు. కొంతమంది పొంతన లేని సమాచారంతో కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. సమావేశంలో జేఏసీ నాయకులు వడ్లూరి రాంచందర్, కుర్బాన్‌అలీ, వెంకటేశ్వర్లు, సురేష్, పెద్ది నర్సింహారావు, పప్పు వెంకట్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, యాదగిరి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికంగా ఆదుకోవాలి



మహదేవపూర్ : సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

మహదేవపూర్ : మండల కేంద్రానికి చెందిన అడుప రాజక్కకు రూ. 28000 సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు మంజూరు కాగా ఎంపీపీ రాణిబాయి రామారావు అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న రాజక్కను ఆర్థికంగా ఆదుకోవాలని భూపాలపల్లి, పెద్దపల్లి జెడ్పీచైర్మన్లు కోరారు. స్పందించిన వారు సీఎం సహాయనిధి ద్వారా రూ. 28000 వేలు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీపతిబాపు, పట్టణ అధ్యక్షులు కురతోట రాకేష్, ఉపసర్పంచ్ సల్మాన్ ఖాన్, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ వెన్నంపల్లి మహేష్, బీఆర్ఎస్ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు కేదారి గీత పాల్గొన్నారు.